E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి :01 సంచిక :151 శనివారం 09 మే 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-



# తమిళనాడు పీఠంపై దళపతి విజయ్?

- ప్రమాణ స్వీకారం పై తీవ్ర ఉత్కంఠ
- గవర్నర్‌కు ఎమ్మెల్యేల జాబితా సమర్పణ
- శనివారం ప్రమాణస్వీకారం అంటూ వార్తలు
- అర్ధరాత్రి దాకా ఎటూ చెప్పని గవర్నర్

## విజయ్ రాజకీయ పయనానికి భారీ విఘాతం: టీవీకేకు షాకిచ్చిన ఐయూఎంఎల్!

చెన్నై,08 మే (తెలుగు గళం): తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే ) పార్టీకి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (IUML) గట్టి షాక్ ఇచ్చింది. అనూహ్య పరిణామాల మధ్య విజయ్ పార్టీకి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు ఐయూఎంఎల్ ప్రకటించడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 118 మంది ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టడంలో విజయ్ తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

**ప్రమాణ స్వీకారం పై సందిగ్ధత**

ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న విజయ్ ఆశలపై గవర్నర్ నీళ్లు చల్లుతున్నారు. ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తే ఆ కొద్దిపాటి ఎమ్మెల్యేలు తెచ్చుకుంటానని విజయ్ చెప్తున్నారు. కానీ గవర్నర్ ఈ వాదనను ఒప్పుకోవడం లేదు. మ్యాజిక్ సంఖ్య 118 చూపెడితేనే ప్రమాణ స్వీకారం అని వెనక్కి పంపించేస్తున్నారు.

ఐయూఎంఎల్ వైదొలగడంతో విజయ్ కూటమికి అవసరమైన మేజిక్ ఫిగర్ మరి కొంత దూరంలో ఉండిపోయింది. ప్రస్తుతం ఐయూఎంఎల్ నేతలు తాము డిఎంకె నేతృత్వంలోని కూటమిలోనే కొనసాగుతామని స్పష్టం చేయడంతో, సంఖ్యాబలం కోసం టీవీకే ఇతర పక్షాల వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**సిద్ధాంతపరమైన విభేదాలే కారణమా?**

మద్దతు ఉపసంహరణ వెనుక బలమైన కారణాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. సిద్ధాంతపరమైన విభేదాలు మరియు కొన్ని కీలక అంశాలపై స్పష్టత లేకపోవడమే ఈ నిర్ణయానికి దారితీసిందని సమాచారం. ఐయూఎంఎల్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ మొహిదీన్ మాట్లాడుతూ, తమది కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే కాదని, సిద్ధాంతపరమైన బంధమని పేర్కొంటూ విజయ్‌కు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీనిపై విజయ్ అభిమానులు మరియు టీవీకే నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

**రాజకీయ ప్రతిష్టంభన – గవర్నర్ అడుగులే కీలకం**

సంఖ్యాబలం తగ్గిపోవడంతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎన్నికల ప్రక్రియలో డెడ్ లాక్ (ప్రతిష్టంభన) ఏర్పడింది. ఎవరికీ స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది.

మిగతా 2లో..

# కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



2 లో

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు మరియు ఉన్నతాధికారులకు కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై కీలక మార్గదర్శనం చేశారు. రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా, శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆయన ఆదేశించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేంద్ర నిధుల వినియోగంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. ప్రతి త్రైమాసికంలోనూ ప్రభుత్వ శాఖలు సగటున 8 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, మొదటి త్రైమాసికం నుంచే ఈ ప్రక్రియ వేగవంతం కావాలని స్పష్టం చేశారు. నిధులు మురిగిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వీలున్నంత వరకు కేంద్రం నుంచి అదనపు నిధులు రాబట్టేందుకు ప్రతి శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా వైద్యారోగ్య శాఖలో రావాల్సిన పెండింగ్ నిధులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

# కలిసి కొడంగల్‌ను అభివృద్ధి చేసుకొందాం



కొడంగల్ (తెలుగు గళం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ లో ఆధ్యాత్మిక, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ కేంద్రంలో అత్యంత వైభవంగా నిర్మించ తలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆయన శనివారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి, ఆలయ నమూనాను పరిశీలించి నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆధ్యాత్మికతతో పాటు అభివృద్ధి బాట**

భూమి పూజ అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. "కొడంగల్ గడ్డ నాకు జన్మనిచ్చిన గడ్డ మాత్రమే కాదు, నన్ను రాజకీయంగా నిలబెట్టిన గడ్డ" అని ఆయన పేర్కొన్నారు. కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, అన్ని రంగాల్లో కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన సాగునీటి ప్రాజెక్టులు, విద్యా సంస్థల ఏర్పాటుపై ఆయన స్పష్టమైన భరోసా ఇచ్చారు. 2 లో



## మూసీ ప్రాజెక్టు.. తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు



2 లో

మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. డీపీఆర్ వివరాలను మంత్రులకు అధికారులు అందజేశారు. తొలిదశలో చేపట్టే పనులకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)తో చర్చలు ముగిశాయని ఉపసంఘానికి తెలిపారు. తొలిదశలో రూ.7,055 కోట్లతో మూసీ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది.

# కరీంనగర్ రాజకీయాల్లో సెగలు



: డీజీపీకి బీఆర్ఎస్ ఫిర్యాదు..
బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం

కరీంనగర్‌లో గురువారం బీఆర్ఎస్ మరియు బీజేపీ కార్యకర్తల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల బృందం హైదరాబాద్‌లో రాష్ట్ర డీజీపీని కలిసి రాతపూర్వక ఫిర్యాదు చేసింది. తమ పార్టీ శ్రేణులపై బీజేపీ నాయకులు కావాలనే దాడులకు దిగారని, పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

మరోవైపు బీఆర్ఎస్ నాయకుల వైఖరిపై కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తప్పు చేసి మళ్లీ తామే బాధితులమంటూ నాటకాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు.

మిగతా 2లో..

# బెంగాల్‌పై కాషాయ జెండా

- ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ఖరారు!



2 లో

కోల్‌కతా ,తెలుగు గళం: పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో చరిత్రాత్మక విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ, రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. గత రెండు రోజులుగా ముఖ్యమంత్రి ఎంపికపై ఢిల్లీ వేదికగా సాగిన ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. అందరూ ఊహించినట్లుగానే, బెంగాల్‌లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన సువేందు అధికారిని ముఖ్యమంత్రిగా బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. ఈరోజు కోల్‌కతాలో జరిగిన బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో సువేందు పేరును అధికారికంగా ప్రకటించారు.

# తుమ్మిడిహెట్టి పునరుద్ధరణే లక్ష్యం

- బీఆర్ఎస్ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం జరిగింది - మంత్రి జూపల్లి



2 లో

కొమురం భీం జిల్లాలో పర్యటించిన ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేసిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరిస్తుందని స్పష్టం చేశారు.

2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని, రూ.38,500 కోట్ల వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే 106 కిలోమీటర్ల కాలువల్లో 71.5 కిలోమీటర్ల భూసేకరణ పూర్తై, 46 కిలోమీటర్ల పనులు కూడా జరిగాయని చెప్పారు.

## మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..?

- సమాచారమివ్వాలని కోరిన హైడ్రా



హైదరాబాద్, మే 08: మీ ప్రాంతాల్లో మైనింగ్ జరుగుతోందా..? కొండలను పిండి చేస్తున్న క్రషర్లు పని చేస్తున్నాయా..? ఆర్ ఎం సీ(రెడీ మిక్స్ కాంక్రీట్) ప్లాట్లు దుమ్ము రేపుతున్నాయా..? పర్యావరణానికి ఇవన్నీ తూట్లు పొడుస్తున్నాయా..? అయితే ఆ సమాచారం హైడ్రా 9000113667కు అందజేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో నగర ప్రజలను కోరారు. ORR కు లోపల, బయట 1 కిలోమీటరు పరిధి లో RMC, క్రషర్లు పని చేస్తున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కరెంటు లొకేషన్‌తో పాటు.. అక్కడి ఫొటోలు వాట్సాప్‌లో షేర్ చేసి సమాచారం ఇస్తే.. వాటి అనుమతులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# తమిళనాడు పీఠంపై 'దళపతి' విజయ్

మొదటి పేజీ తరువాయి

గవర్నర్ తదుపరి అడుగులు ఏమిటనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే విజయ్ తన వద్ద 118 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని గవర్నర్‌కు లేఖ రాసినట్లు వార్తలు వచ్చినప్పటికీ, తాజా పరిణామాలతో ఆ లెక్కలు తారుమారయ్యాయి.

### కుప్పకూలిన సమీకరణాలు

ఈ పరిణామం విజయ్ రాజకీయ జీవితంలో అతిపెద్ద సవాలుగా మారింది. సుదీర్ఘ కాలం పాటు సినీ రంగంలో అగ్రస్థానంలో కొనసాగి, రాజకీయాల్లో మార్పు తెస్తానని వచ్చిన విజయ్‌కు మొదటి అడుగులోనే ఇటువంటి అడ్డంకులు ఎదురుకావడం గమనార్హం. ప్రస్తుతం టీవీకే వద్ద స్వంతంగా 108 సీట్లు ఉండగా, కాంగ్రెస్ (5), లెఫ్ట్ పార్టీల మద్దతు తో కలిసి 116 అవుతోంది. ఐయూఎంఎల్ తప్పుకోవడంతో మరో నలుగురు ఎమ్మెల్యేల మద్దతును ఎలా సంపాదిస్తారనేది మిస్టరీగా మారింది.

### ప్రతిపక్షాల ఎత్తుగడలు

మరోవైపు, ప్రతిపక్ష డిఎంకె ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తోంది. ఎం.కె. స్టాలిన్ ఇప్పటికే తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసినప్పటికీ, కేర్‌టేకర్ సిఎంగా కొనసాగుతున్నారు. ఒకవేళ విజయ్ మెజారిటీ నిరూపించుకోవడంలో విఫలమైతే, మళ్లీ పాత కూటమినే అధికారంలోకి తీసుకురావడానికి డిఎంకె పావులు కదుపుతోంది. అటు ఏఐఏడీఎంకే కూడా విజయ్‌కు మద్దతు ఇచ్చే ఆలోచన లేదని స్పష్టం చేయడంతో రంగం మరింత సంక్లిష్టంగా మారింది.

### టీవీకే అత్యవసర సమావేశం

విజయ్ తదుపరి స్పందన కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టీవీకే ముఖ్య నేతలు మామల్లపురంలోని ఒక హోటల్‌లో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు. తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా ఉండేందుకు పార్టీ నాయకత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. సంఖ్యాబలం కోసం చిన్న పార్టీలు మరియు స్వతంత్ర అభ్యర్థులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

### అనిశ్చితిలో రాష్ట్ర భవిష్యత్తు

ప్రస్తుతానికి తమిళనాడు రాజకీయ రంగస్థలం అనిశ్చితిలో ఉంది. ప్రజా తీర్పు ఒకవైపు ఉంటే, రాజకీయ సమీకరణలు మరోవైపు ఆడుతున్న ఈ చదరంగంలో ఎవరు విజేతగా నిలుస్తారో కాలమే నిర్ణయించాలి. సంఖ్యాబలం కోసం సాగుతున్న ఈ పోరులో అంతిమంగా ప్రజల ప్రయోజనాలు దెబ్బతినకూడదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### కీలకమైన 24 గంటలు

రానున్న 24 గంటలు రాష్ట్ర రాజకీయాలకు అత్యంత కీలకం. ఏదో ఒక అనూహ్య మలుపు తిరిగే అవకాశం ఉందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద విజయ్ తన రాజకీయ ప్రస్థానంలో ఎదుర్కొంటున్న ఈ సంక్షోభం ఆయన నాయకత్వ పటిమకు ఒక పరీక్షగా నిలిచింది. గవర్నర్ నిర్ణయం వెలువడే వరకు తమిళనాడులో ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

# కలిసి కొడంగల్ ను అభివృద్ధి చేసుకొందాం

మొదటి పేజీ తరువాయి

సాకారం చేసుకుందాం.. పిలుపునిచ్చిన రేవంత్

రాష్ట్ర అభివృద్ధిలో కొడంగల్ భాగస్వామ్యం కావాలని, ప్రతి ఒక్కరూ ఈ అభివృద్ధి యజ్ఞంలో తోడుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. "మనం కలలుగన్న కొడంగల్ అభివృద్ధిని మనమే సాకారం చేసుకుందాం" అంటూ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక నిధులను కేటాయించినట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి, రాబోయే రోజుల్లో కొడంగల్ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ధీమా వ్యక్తం చేశారు.

తిరుమల తరహాలో కొడంగల్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అద్భుతమైన శిల్పకళతో నిర్మించనున్నారు.

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తమ నియోజకవర్గ బిడ్డ ముఖ్యమంత్రి హోదాలో రావడంతో కొడంగల్ జనసంద్రమైంది. ఎక్కడికక్కడ పూల వర్షంతో రేవంత్ రెడ్డికి ఘనస్వాగతం లభించింది.

సభ వేదికగా పలువురు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను పంపిణీ చేసి, పాలనను ప్రజల ముంతీర్పుకు దగ్గరగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

ఆధ్యాత్మిక కార్యక్రమంతో మొదలైన ఈ పర్యటన, కొడంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఇచ్చిన స్పష్టమైన హామీలతో నియోజకవర్గ ప్రజల్లో కొత్త ఆశలను చిగురింపజేసింది.

# కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం నీతి ఆయోగ్ నిధులను సైతం తెచ్చుకునేలా ప్రయత్నించాలని చంద్రబాబు సూచించారు. పీపీపీ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా నిధులను సమీకరించుకుని ప్రాజెక్టులను పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'పీఎం ఇ-బస్' పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బస్ స్టేషన్ల ఆధునీకరణతో పాటు ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు.

రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో భాగంగా అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని చంద్రబాబు సూచించారు. విజయవాడ-గుంటూరు-అమరావతి, విశాఖ-అనకాపల్లి-విజయనగరం, తిరుపతి పరిసర ప్రాంతాలను కలుపుతూ ఈవీ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం 'అర్బన్ ఛాలెంజ్ మోడ్'లో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి, కేంద్రం నుంచి వచ్చే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలని ఆయన వివరించారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో అధికారుల పాత్ర కీలకమని గుర్తు చేస్తూ, కేంద్ర పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రతి త్రైమాసికానికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో వైఫల్యం చెందకూడదని, నిధుల వినియోగంపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షణ పెంచి, అభివృద్ధి పనుల్లో వేగాన్ని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సమావేశంలో స్పష్టం చేశారు.

# మూసీ ప్రాజెక్టు.. తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు

మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. డీపీఆర్ వివరాలను మంత్రులకు అధికారులు అందజేశారు. తొలిదశలో చేపట్టే పనులకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)తో చర్చలు ముగిశాయని ఉపసంఘానికి తెలిపారు. తొలిదశలో రూ.7,055 కోట్లతో మూసీ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

# కరీంనగర్ రాజకీయాల్లో సెగలు

మొదటి పేజీ తరువాయి

కరీంనగర్ గడ్డపై అరాచకాలను సహించేది లేదని, తమ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ ఉనికి కోల్పోతుందనే భయంతోనే ఇలాంటి అల్లర్లకు పాల్పడుతోందని బండి సంజయ్ ధ్వజమెత్తారు.

ఈ ఘర్షణల నేపథ్యంలో కరీంనగర్‌లో పోలీసులు భారీగా మోహరించి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. రాజకీయ వైషమ్యాలు దాడుల వరకు వెళ్లడం పట్ల స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీజీపీకి ఫిర్యాదు చేసిన అనంతరం బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ, జిల్లాలో ప్రజాస్వామ్యబద్ధంగా కార్యక్రమాలు చేసుకోనివ్వకుండా బీజేపీ అడ్డుకుంటోందని ఆరోపించారు.

బండి సంజయ్ తన స్పందనలో, శాంతియుతంగా ఉన్న కరీంనగర్‌లో ఉద్రిక్తతలు సృష్టించడమే బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుందని దుయ్యబట్టారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అక్రమ కేసులు పెట్టి వేధించారని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా అదే ధోరణి కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఏవైనా గొడవలు జరిగితే దానికి బీఆర్ఎస్ నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుతం డీజీపీ ఈ ఫిర్యాదుపై స్పందిస్తూ, క్షేత్రస్థాయి నివేదికను తెప్పించుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే రోజుల్లో ఈ వివాదం మరెన్ని రాజకీయ మలుపులు తిరుగుతుందోనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తుమ్మిడిహెట్టి పునరుద్ధరణే లక్ష్యం: మంత్రి జూపల్లి

మొదటి పేజీ తరువాయి

అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టిని పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీగా ఖర్చు పెట్టిందని ఆరోపించారు. గ్రావిటీ ద్వారా రావాల్సిన నీటిని పంపులతో ఎత్తిపోసే విధానం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని, విద్యుత్ ఖర్చులు పెరిగాయని అన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు ప్రాంత రైతులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం నీటి వినియోగం కూడా దెబ్బతిన్నదని విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తి చేయడానికి కట్టుబడి ఉందని జూపల్లి తెలిపారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించేలా ప్రయత్నిస్తామని, ముంపు బాధితులకు పరిహారం అందిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో రెండు రాష్ట్రాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు.

ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో కేంద్రం ఈ ప్రాజెక్టుకు సహకరించాలని కోరారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ప్రాజెక్టు సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బెంగాల్‌పై కాషాయ జెండా



మొదటి పేజీ తరువాయి

### అధిష్టానం కసరత్తు.. సువేందుకే మొగ్గ

రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న తర్వాత ముఖ్యమంత్రి పీఠం ఎవరికి దక్కుతుందనే అంశంపై బీజేపీ అగ్రనాయకత్వం సుదీర్ఘంగా చర్చించింది. పలువురు సీనియర్ నేతల పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో బలమైన పట్టున్న సువేందు అధికారి వైపే అధిష్టానం మొగ్గు చూపింది. పార్టీ కేంద్ర పరిశీలకుల సమక్షంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలందరూ సువేందు నాయకత్వానికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. దీంతో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు.

### సువేందు రాజకీయ ప్రస్థానం

సువేందు అధికారి ఎంపిక వెనుక ఆయన సాధించిన అసాధారణ విజయాలు ఉన్నాయి. గతంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నేతగా, మంత్రిగా అనేక బాధ్యతలు నిర్వహించిన ఆయన, బెంగాల్ రాజకీయ నాడిని పట్టుకున్న నేతగా గుర్తింపు పొందారు. అనంతరం బీజేపీలో చేరిన సువేందు, నందిగ్రామ్ వంటి కీలక నియోజకవర్గాల్లో మాజీ ముఖ్యమంత్రిని వరుసగా రెండుసార్లు ఓడించి తన సత్తా చాటారు. ఈ అసాధారణ పోరాట పటిమే ఆయనను ముఖ్యమంత్రి పీఠానికి చేరువ చేసింది.

బెంగాల్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతు రాలైన నేతను ఆమె సొంత గడ్డపైనే ఓడించడం ద్వారా సువేందు బీజేపీలో తిరుగులేని నేతగా ఎదిగారు.

టీఎంసీ నుంచి వచ్చినప్పటికీ, అతి తక్కువ కాలంలోనే బీజేపీ కేడర్‌తో మమేకమై పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో ఆయన పోషించిన పాత్ర అమోఘం.

గతంలో పాలనాపరమైన పదవులు నిర్వహించిన అనుభవం ఉండటంతో, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు సువేందు సరైన వ్యక్తి అని కేంద్ర నాయకత్వం భావించింది.

### కొత్త ప్రభుత్వం.. భారీ ఆశలు

బెంగాల్‌లో దశాబ్దాల వామపక్ష, తృణమూల్ పాలన తర్వాత బీజేపీ ప్రభుత్వం కొలువు తీరుతుండటంతో ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పారిశ్రామికాభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా సువేందు అధికారి తన పాలనను సాగించనున్నట్లు తెలుస్తోంది. కోల్‌కతాలోని రాజ్‌భవన్‌లో త్వరలోనే ఈ ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా జరగనుంది. ఈ పరిణామంతో అటు బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతుండగా, బెంగాల్ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం మొదలైంది.

# రాజోలి ప్రాజెక్టు బాధిత రైతులకు న్యాయం చేయండి.

- త్వరతగతిన రాజోలి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి.
- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరణాల శివనారాయణ డిమాండ్.




కడపజిల్లా(తెలుగు గళం) మే08:- జమ్మలమడుగు నియోజకవర్గం,పెద్దముడియం మండలంలోని రాజోలి ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని ప్రాజెక్టు నిర్మాణం ప్రభుత్వం త్వరత గతిన సమస్యలుపరిష్కరించి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరణాల శివనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జమ్మలమడుగులో స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నందు మీడియాసమావేశంలో శివనారాయణ మాట్లాడుతూ పెద్దముడియం మండలంలో నాడు రాజశేఖర్ రెడ్డి

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2008లో 2.95 టీఎంసీ సామర్థ్యంతో రాజోలి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు నాలుగువేల ఎకరాలు సేకరించి ఒప్పంద పత్రాలు కూడా ఇచ్చారని అన్నారు. అయితే కాలానుగుణంగా నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించడం తర్వాత రాజోలి ప్రాజెక్టు నిర్మాణం అటకెక్కింది అన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు చేపట్టలేదన్నారు. తర్వాత జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మళ్ళీ 2019 లో అధికారంలో మరోసారి శంకుస్థాపన చేశారని, జగన్ కొత్త జీవో తెచ్చి ఒప్పంద పత్రాలు అందజేసిన తరవాత నాలుగు నెలలలో నగదు జమా చేస్తామని హామీ ఇచ్చారని, అది అమలు చేయలేదన్నారు. తర్వాత భూములు ఇచ్చిన రైతులు రాజముద్ర కారణంగా ఇచ్చిన భూములు. అమ్ముకోవాలన్న, తాకట్టుపెట్టు కోవాలన్న రిజిస్ట్రేషన్ కాకపోవడంతో రైతులు పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు డబ్బులు లేక అప్పులు చేస్తున్నారని. అన్నారు. భూములు వున్నా ఉపయోగకరం లేదన్నారు. క్రయ విక్రయాలకు నోచుకోకపోవడం దారుణ అన్నారు. ఎకరాకు 12.50 లక్షలు రూపాయలతో ప్రభుత్వం రైతుల నుండి భూములు. తీసుకున్నారన్నారు. ఇప్పుడు ప్రాజెక్టు నిర్మాణం జరుగక, భూములు రిజిస్ట్రేషన్ కాక రైతులు తీవ్ర ఆవేదనకు గురి అవుతున్నారని. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి పెద్దముడియం మండలంలో నీ రాజోలి ప్రాజెక్టు భూ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో నారాయణ,రామయ్య,భాషా,బాలు,తదితరులు పాల్గొన్నారు.

# బడుగువానిలంకలో పూల సాగుపై అవగాహనా సదస్సు




ఆలమూరు(తెలుగు గళం)మే 8: ఆలమూరు మండలం బడుగువానిలంకలో కొత్తపేట ఉద్యాన అధికారి ఆధ్వర్యంలో పూల సాగుపై రైతులకి శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకి వివిధ పూల పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులపై వేమగిరి పూల పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డా.డివిఎస్ రాజు వివిధ విభాగాల శాస్త్రవేత్తలైన డా. శిరీష (నులి పురుగుల), డా.రవితేజ (ఉద్యాన) రైతులకు జీవన ఎరువులైన సూడోమోనస్, ట్రైకొడర్మా,విఎమ్, పాసిలోమైసిస్ వినియోగాన్ని వివరించారు. తక్కువ ఖర్చుతో మేలైన పంట యాజమాన్య పద్ధతులు పాటించి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి లాభాదాయక వ్యవసాయం చేయడంలో అవగాహన కల్పించారు. అలాగే పలువురు రైతుల బంతి,చామంతి పువ్వులపై దోమ ఆశించి పంటను పాడు చేస్తుందని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లగా నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఉద్యాన అధికారి డా.జి.కోటేశ్వరరావు పూల సాగుకు ఉద్యాన శాఖ ద్వారా ఇస్తున్న రాయితీలను వివరించారు. అనంతరం కొన్ని క్షేత్ర సందర్శనలు చేసి రైతులకి యాజమాన్య పద్ధతులు సూచించారు...

# తూకాలు వేయాలంటే.. లంచాలు ఇవ్వాలా..?: కేటీఆర్




వీర్నపల్లి: పండించిన ధాన్యం తూకాలు వేసేందుకు రైతులు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. దేశం వదిలించుకున్న దారిద్ర్యాన్ని రాష్ట్రంలో నెత్తిన పెట్టుకున్నట్లు అయిందని కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. హామీలు, ప్రజా సంక్షేమాన్ని మరచి కుర్చీలు కాపాడుకునేందుకు దిల్లీకి మూటలు మోస్తున్నారని మండిపడ్డారు. సమ్మక్క-సారలమ్మ జాతర పనుల్లో వాటాల కోసం మంత్రులు కొట్లాడుకున్నారని విమర్శించారు. కొత్త పథకాల సంగతి పక్కనపెడితే... ఉన్నవి కూడా తొలగిస్తున్నారని మండిపడ్డారు. మక్కల కొనుగోళ్లకు కనీసం గన్నీ సంచులు సరఫరా చేసే సోయి ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

నర్సంపేట ప్రాంతంలో వందల సంఖ్య వాహనాలతో మార్కెట్ల ఎదుట అన్నదాతలు పడిగాపులు కాస్తున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. భారాస హయాంలో అడగకుండానే రైతు బంధు వేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కేసీఆర్ సభ పెడితే... నెలకో ఎకరానికి కిస్తీల ప్రకారం రైతుబంధు పంపిణీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. 420 హామీలపై నిలదీస్తే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులకు జంకే ప్రసక్తే లేదన్నారు. జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే దమ్ము ప్రభుత్వానికి లేదని చెప్పారు. మత రాజకీయాలు తప్ప కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ప్రజా సంక్షేమం, రైతుల సమస్యలపై కనీస అవగాహన లేదని విమర్శించారు. ప్రభుత్వ నిధులతో యాదగిరిగుట్ట ఆలయాన్ని కట్టామని గుర్తుచేశారు. రామమందిర నిర్మాణంలో ప్రజా భాగస్వామ్యం మాత్రమే ఉందన్నారు.

## మంచినీటిలో డ్రైనేజీ కలుస్తోంది..శాశ్వత పరిష్కారం చేయాలి- హెచ్‌సీఎఫ్ డిమాండ్

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ మే08



హైదరాబాద్ నగరంలోని బాగ్‌లింగంపల్లి ఎల్ఐజి క్వార్టర్స్‌లో మంచినీటిలో డ్రైనేజీ కలుస్తున్న సమస్యను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం డిమాండ్ చేసింది.ఈ మేరకు అధికారులు ప్రాంతాన్ని పరిశీలించగా, సంబంధిత జీఎం శ్రీధర్, డీజీఎం విష్ణువర్ధన్‌లు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.హెచ్‌సీఎఫ్ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, 2026 మార్చి 1వ తేదీ నుంచి ఎల్ఐజి క్వార్టర్స్‌లో మంచినీటిలో డ్రైనేజీ కలిసివస్తోందని తెలిపారు.దుర్వాసనతో కూడిన నీరు రావడంతో పలువురు స్థానికులు మంచినీరు ఉపయోగించడానికే భయపడుతున్నారని, మరికొందరు డబ్బులు ఖర్చు చేసి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై మార్చి 1న, ఏప్రిల్ 8న జీఎం, డీజీఎం, మేనేజర్‌లకు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే సమస్య పునరావృతమవుతోందని, అధికారులు తాత్కాలికంగా డ్రైనేజీ క్లీనింగ్ చేసి సమస్య పరిష్కారమైందని చెబుతున్నారని విమర్శించారు.భవిష్యత్తులో మంచినీటిలో డ్రైనేజీ కలవకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని, బోలక్‌పూర్ తరహా ఘటనలు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని హెచ్‌సీఎఫ్ కోరింది.ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వీరయ్యతో పాటు నాగేశ్వరరావు, సంగీత, రమేష్, శంకరయ్య, నగేష్, పాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలి

### - బాలల హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ మే08



బండ్లగూడ మండలంలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగంమెట్ డివిజన్ కన్వీనర్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని, వాటి వినియోగంపై సీఎం స్థాయిలో ప్రతి నెల పర్యవేక్షణ ఉండాలని కోరారు. ప్రీ–ప్రైమరీ విద్యను సాధారణ పాఠశాల వ్యవస్థలో భాగం చేయాలని, ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి క్లర్కులు, అకౌంటెంట్లు వంటి సహాయక సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 2,000 మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఫౌండేషన్ స్కూల్స్ ప్రారంభించాలని కోరారు.ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యా వ్యవస్థలో విలీనం చేయాలని, ప్రైవేటు పాఠశాలలు మరియు జూనియర్ కాలేజీల ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు.'ఎడ్యుకేషన్ స్టాండర్డ్ అథారిటీ' ఏర్పాటు చేసి విద్యా ప్రమాణాలను పర్యవేక్షించాలని, 3 నుంచి 18 ఏళ్ల పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్య కల్పించేలా చట్టాన్ని సవరించాలని సూచించారు. బాలికలకు పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, వలస కార్మికుల పిల్లలు, అనాథలు, వీధి బాలల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ కార్యకర్తలు సత్యనారాయణ, వినోద్, పద్మ, సీఆర్‌పీఎఫ్ నాయకులు విద్యాసాగర్, శంకర్, గిరిధర్, శ్రీరాములు, పద్మరాజు, అనురాధ, కిశోర బాలికలు, యూత్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు తూట్లు

### రైతులకు సమాచారం లేకుండా ఇరిగేషన్ శాఖ సభ

### 33 గ్రామాల రైతులు గైర్హాజరు: ఏకైక సర్పంచ్‌తో ఇరిగేషన్ డీఈ రాజు 'పేరుకే' సమావేశం



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 8

వరంగల్ జిల్లా:పర్వతగిరి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవంలో నిర్వహించాల్సిన ఇరిగేషన్ శాఖ మండల స్థాయి సమావేశం తూతూ మంత్రంగా జరిగింది.వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో జరిగిన ఈ సమావేశానికి మండల వ్యాప్తంగా 33 గ్రామాల రైతులు గైర్హాజరయ్యారు.ఆరుగురు ఆంజనేయ స్వాములతో సభ: నీటిపారుదల,శాఖ,ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 9 వరకు మండల వ్యాప్తంగా రైతులతో ప్రత్యేక సభలు నిర్వహించాలి.అయితే ఇరిగేషన్ అధికారులు 33 గ్రామాల సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు, తూముల నిర్వహణ విఆర్ఎలకు సరైన సమాచారం ఇవ్వకుండా సభ నిర్వహించారు."తక్కువ ధరకు జీలుగు విత్తనాలు ఇస్తున్నామని పిలిచి ఆరుగురు ఆంజనేయ స్వాములతో సభ నిర్వహించడం గమనార్హం"అని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ సభకు పర్వతగిరి ఏకైక సర్పంచ్ చీదురు శంకర్ మాత్రమే హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు ఎవరూ హాజరుకాలేదు.డీఈ రాజుపై గతంలోనూ ఆరోపణలు ఇరిగేషన్ డీఈ రాజుపై గతంలోనూ ఎన్నో ఆరోపణలు ఉన్నాయని, అయినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని మండల రైతులు చర్చించుకుంటున్నారు.గత సంవత్సరం పర్వతగిరి మండలంలోని రిజర్వాయర్,పలు చెరువుల్లో చేపలు పట్టడానికి నీటిని వృథాగా వదిలిపెట్టినా అధికారికంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

యువరైతు పోకల శంకర్ ఆగ్రహం:

"మండల వ్యాప్తంగా నిర్వహించాల్సిన నీటిపారుదల శాఖ సభకు రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు.కొందరితో మాత్రమే సమావేశం నిర్వహించి చేతులు దులుపుకున్నారు. సంబంధిత అధికారులపై ఉన్నత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి"అని యువరైతు పోకల శంకర్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్,ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే08



స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని 33/11కేవి ఘనపూర్ టౌన్ విద్యుత్ ఉపకేంద్రంతో పాటు తాటికొండ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘనపూర్ ఆపరేషన్ ఏఈ పగిడిముంతల శంకర్ తెలిపారు,ప్రతినెల రెండో శనివారం సబ్ స్టేషన్లలో నెలవారి (మెంటనెన్స్) మరమ్మతులు చేపడుతున్న కారణంగా 33/11కేవి ఘనపూర్ టౌన్ మరియు తాటికొండ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మూడుగంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించ వలసిందిగా ఏఈ శంకర్ కోరారు.

## ఉప్పుగల్లులో దంస కెనాల్‌లో మట్టి చోరీ

### పట్టించుకోని రెవెన్యూ మైనింగ్ అధికారులు



తెలుగు గళం న్యూస్, జఫర్గఢ్, మే 08

జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం ఉప్పుగల్లు గ్రామ శివారులో ఉన్న దంస కెనాల్ కాలువలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో యంత్రాల సహాయంతో కాలువను లోతుగా తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.ఈ కాలువ ద్వారా మండలంలోని పలు గ్రామాల మీదుగా ధంసా చెరువుకు సాగునీరు చేరుతుండగా, అక్రమ తవ్వకాల వల్ల కాలువ దెబ్బతిని నీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.కాలువను అధికంగా లోతు చేయడం వల్ల దిగువ ప్రాంతాలకు నీరు సరిగా చేరక రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ మట్టి తవ్వకాలపై ఇప్పటికే రెవెన్యూ మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. వెంటనే స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## నారాయణ పురంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

### గ్రామ సర్పంచ్ మూడు జంపా నాయక్, ఉప సర్పంచ్ ఉమాదేవి



తెలుగు గళంన్యూస్ పర్వతగిరి/మే8

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం, పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన మూడు రవికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గ్రామ సర్పంచ్ మూడు జంపా నాయక్, ఉప సర్పంచ్ ఉమ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమలత, పాలకవర్గ సభ్యులు సునీత,మంజుల,లక్ష్మి, ఏకాంతం శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖమ్మంపాటి సాయిలు,స్లైలాబ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారి కళలు నిజం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

### మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి / మే8



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలోని పెద్దతండ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో అధికారులు మరియు సర్పంచ్ల కలిసి ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్.

పేదవారి కళలు నిజం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆర్ గ్యారంటీలు అమలు చేసి దిశగా ప్రజా ప్రభుత్వ పని చేస్తుందని, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు,తెల్ల రేషన్ కార్డు,సన్న బియ్యం,రెండు వందల యూనిట్ల ఉచిత కరెంటు, మహిళ తల్లులకు ఉచిత బస్సు అనేక సౌకర్యాలు కల్పించి ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవడంలో ప్రజా నాయకుడు కే. ఆర్. నాగరాజు ముందు వరుసలో ఉంటారని తెలిపారు.ఈ ప్రాంత అభివృద్ధి కోసం,ఈ ప్రాంత ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం మా శాసనసభ్యులు అనేక రకాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమ పథకాలు దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ఎవరైతే అర్హులు ఉంటారో వారికె అందించడం ఈ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుశీల వీరన్న, ధూప తండా సర్పంచ్ తిరుపతి,అన్నారం గ్రామపటి అధ్యక్షుడు గొడుగు రమేష్, బూత్ కన్వీనర్ మోహన్ నాయక్, నాయకులు హోల్ సింగ్, యూత్ కాంగ్రెస్ నాయకులు విజేందర్ మరియు తదితర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పార్టీలు, కులాలు పక్కన పెట్టండి: కనపర్తిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు బాల వికాస్ చొరవ

తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే8



హనుమకొండ జిల్లా:ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామంలో బాల వికాస్ ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణంపై 30 మంది ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కె .రాజు కుమార్ మాట్లాడుతూ... "బాల వికాస్ గత 40 సంవత్సరాలుగా తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల్లో పలు గ్రామాభివృద్ధి పథకాలను కొనసాగిస్తూ లక్షలాది మందికి లబ్ది చేకూరుస్తోంది.గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక్కరితో సాధ్యం కాదు. గ్రామ పౌరులందరూ ఒకే ఆశయం కోసం పనిచేస్తే మార్పు సాధ్యం. స్థిరమైన మార్పు కోసం నాయకులంతా ఐకమత్యంతో పార్టీలు,కుల మత వర్గాలకు అతీతంగా కలిసి పనిచేయాలి. 'గ్రామం మనది బాధ్యత మనదే'అనే స్ఫూర్తితో ప్రజలలో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉంది"అని తెలిపారు.గ్రామ సర్పంచ్ రిషిక ఎల్లస్వామి మాట్లాడుతూ..."సంస్థ మా గ్రామాన్ని దత్తత తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. ప్రతి వీధి నుండి ప్రజలు ఈ పథకంలో భాగస్వాములు అయ్యేలా చూస్తాం.గ్రామ పంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాం.గ్రామ సభకు ప్రతి కుటుంబం నుండి కనీసం ఒక్కరు హాజరయ్యేలా ప్రయత్నిస్తాం.



సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి మార్పు దిశగా అడుగులు వేస్తాం" అని హామీ ఇచ్చారు.ఉప సర్పంచ్ నోముల కుమారస్వామి మాట్లాడుతూ... "సంస్థ మా గ్రామానికి ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటాం. అందరం కలిసి ఊరి కోసం పని చేయడానికి సిద్ధంగా ఉన్నాం"అని తెలిపారు.ఈ సమావేశంలో వార్డు సభ్యులు,గ్రామంలోని 15 మంది ముఖ్య నాయకులు, పంచాయతీ సెక్రటరీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, బాల వికాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో కొనుగోలు కేంద్రాల తనిఖీ

### రైతులకు అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే కేఆర్,కలెక్టర్ సత్యశారద



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 8

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట నియోజకవర్గం వర్ధన్నపేట మండలంలో మక్కలు,వడ్ల కొనుగోలు కేంద్రాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆకస్మికంగా సందర్శించారు.వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు సూచనలు చేశారు. రైతులను అప్రమత్తం చేసి వారికి కొండంత భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం పాల్గొన్నారు.చెరువు కట్ట అభివృద్ధికి 10 కోట్లు:

అనంతరం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని చెరువు కట్ట మైసమ్మను ప్రజలు ఘనంగా కొలిచారు.మైసమ్మ వద్ద ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ...

"కొనారెడ్డి చెరువు కట్టను గత పాలించిన నాయకులు ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలి.గతంలో తెగిన చెరువు కట్టను తెగకుండా కాపాడాం. ఈ వర్ధన్నపేట చెరువు కట్ట అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి 10 కోట్లు మంజూరు చేయిస్తాం.ఈ రెండు సంవత్సరాల అభివృద్ధి,గత పది సంవత్సరాల అభివృద్ధి ప్రజలకు తెలుసు.కాంగ్రెస్ పార్టీయే ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ కన్నయ్య,జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు మరుపట్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తుంబూరులో మువ్వా సందడి"



సత్తుపల్లి,ఆర్ సి,మే 8(తెలుగుగళం) న్యూస్ : మండలంలోని తుంబూరు గ్రామంలో జరిగిన వివాహ వేడుకతో పాటు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొన్నారు.

గ్రామానికి చెందిన కత్తురోజు వెంకటాచారి, ప్రభావతి దంపతుల కుమారుని వివాహ వేడుకకు హాజరైన మువ్వా విజయబాబు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తుంబూరు గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం--అంతర్జాతీయ తలసీమియా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- తలసీమియా బాధితులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలకు పాలకవర్గాన్ని అభినందించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య













తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే08

హనుమకొండ రెడ్ క్రాస్ భవన్లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం?అంతర్జాతీయ తలసీమియా దినోత్సవ వేడుకలకు వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డా. కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముందు ఎంపీ డా. కడియం కావ్య ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ను సందర్శించి అక్కడి వృద్ధులతో ముచ్చటిస్తూ, క్యారం బోర్డు ఆడి వారిలో ఉత్సాహం నింపారు.అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ తలసీమియా వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.అంతర్జాతీయ తలసీమియా దినోత్సవం సందర్భంగా తలసీమియా బాధితులకు పండ్లు పంపిణీ చేసి, వారికి రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను అభినందించారు.ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి డా. కడియం కావ్య పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను కొనసాగించారు.ఈ సందర్భంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్కు చెందిన 20 మంది కార్మికులకు కిచెన్ సెట్లు, బ్లాంకెట్లను డా. కడియం కావ్య పంపిణీ చేశారు.ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య మాట్లాడుతూ.. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ రక్తకేంద్రం, తలసీమియా కేంద్రం, జనరిక్ మెడికల్ షాప్ నిర్వహణలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రెడ్ క్రాస్ సేవలు ఎల్లప్పుడూ ముందుంటాయని పేర్కొన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో రక్తకేంద్రాల్లో రక్త కొరత అధికంగా ఉంటుందని, అదే సమయంలో అనేక మంది రోగులు నిరంతరం రక్తంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా తలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి తరచూ రక్త మార్పిడి అవసరమవుతుందని, వారికి రక్తం కేవలం అవసరం మాత్రమే కాకుండా ప్రాణాధారమని అన్నారు.ఈ నేపథ్యంలో యువత, సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్త కొరత లేకుండా చూడాలని పిలుపునిచ్చారు.రక్తదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా తాను రెడ్ క్రాస్ సభ్యత్వం స్వీకరించి సంస్థ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్యను రెడ్ క్రాస్ పాలకవర్గం రెడ్ క్రాస్ క్యాప్, శాలువా, షీల్డ్లతో ఘనంగా సత్కరించింది.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిల్ల రమణా రెడ్డి, భూపాలపల్లి రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, డెమో అశోక్ రెడ్డి, మాతా శిశు సంక్షేమ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ రుబీనా అఫ్రోజ్, రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- నిత్య విద్యార్థిగా ఉంటేనే జీవితంలో మరింత ఎదుగుదల
- రాయిని పదును పెడితేనే డైమండ్ అవుతుంది
- యువతకు ఫిజికల్ హెల్త్తో పాటు మెంటల్ హెల్త్ కూడా ముఖ్యం
- మెడిటేషన్తో మానసిక ప్రశాంతత సాధించాలని సూచన
- "నీతో నువ్వు యుద్ధం చేస్తే బుద్ధుడు" అంటూ యువతకు సందేశం
- ఒక జాబ్ రాకపోతే మరో అవకాశం కోసం ప్రయత్నించాలి
- ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు స్టార్టప్స్, వ్యాపారాలపై దృష్టి పెట్టాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య







తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే08

హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో రాష్ట్ర పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, శాసనసభ్యులు కె ఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.ఈ జాబ్ మేళాలో ఏర్పాటు చేసిన 72 ప్రముఖ కంపెనీల స్టాల్స్ ను ఎంపీ సందర్శించారు.వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి ముందుకు రావడం సంతోషకర విషయమన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో గడ్డుకాలం నడుస్తోందన్నారు.టాలెంట్, హార్డ్వర్క్ ఉన్నప్పటికీ అనేక దేశాల్లో ఉద్యోగ భద్రత సవాల్గా మారిందని పేర్కొన్నారు.అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ఉదయం లేచేసరికి ఉద్యోగం కోల్పోయామని తెలిసే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.ఇలాంటి సమయంలో యువత నిరాశ చెందకుండా నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. తాను కూడా ప్రైవేట్ రంగంలో డాక్టర్గా పనిచేసి, అనంతరం ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ప్రజాప్రతినిధిగా సేవలందిస్తున్నానని తెలిపారు..ఎంబీబీఎస్ చదివిన కారణంగా పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులు, దేశవ్యాప్తంగా అమలు చేసే విధానాలపై లోతైన అవగాహన ఏర్పడిందన్నారు. ఒక బిల్లును ప్రవేశపెట్టే ముందు అనేక కోణాల్లో చదివి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా మన్నారు.విద్యార్థి దశ ముగిసిన తర్వాత కూడా ప్రతి ఒక్కరూ "నిత్య విద్యార్థి"గా ఉండాలని, నిరంతరం చదువుకుంటూ కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉంటేనే జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు.ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా ఎదుగుదల కోసం చదువు ఆగకూడదని, "రాయిని పదును పెడితేనే డైమండ్ అవుతుంది" అంటూ యువతలో ఆత్మవిశ్వాసం నింపారు.ప్రస్తుతం యువతకు ఫిజికల్ హెల్త్తో పాటు మెంటల్ హెల్త్ కూడా ఎంతో ముఖ్యమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. "ప్రపంచంతో యుద్ధం చేస్తే అలెగ్జాండర్.. నీతో నువ్వు యుద్ధం చేస్తే బుద్ధుడు" అనే వ్యాఖ్యను ఉదహరిస్తూ మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు.ప్రతిరోజూ మెడిటేషన్, పాజిటివ్ థింకింగ్ అలవాటు చేసుకుంటే మానసికంగా దృఢంగా మారి భవిష్యత్తులో విజయాలు సాధించగలరని తెలిపారు.జీవితం చాలా చిన్నదని, కానీ ప్రయత్నం మాత్రం ఎప్పటికీ ఆగకూడదన్నారు. ఒక ఉద్యోగం రాకపోతే మరో అవకాశానికి సిద్ధంగా ఉండే ధైర్యం యువతలో ఉండాలని చెప్పారు.ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్టార్టప్స్, వ్యాపారాలు, ప్రైవేట్ రంగం, ఇతర ఉపాధి అవకాశాల వైపు కూడా యువత ఆలోచించాలని సూచించారు. జాబ్ మేళాకు



హాజరైన ప్రతి యువకుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ లక్ష్యాలను సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎంపీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 11 నుంచి ఇండ్ల గణన

## మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.





జనగణన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి మరిపెడ మండల వ్యాప్తంగా ఇండ్ల గణన సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు. మండలాన్ని మొత్తం 158 బ్లాకులుగా విభజించి ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో 87 మంది ఎన్యూమరేటర్లు (ఉపాధ్యాయులు), 14 మంది సూపర్వైజర్లు పాల్గొని గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు చెప్పారు. సర్వే సమయంలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ సర్వే ప్రక్రియ మే 11 నుంచి జూన్ 9 వరకు కొనసాగానున్నట్లు తెలిపారు. ఇండ్ల వివరాలు సేకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

కచ్చితత్వంతో నిర్వహించేందుకు అధికారులకు ఇప్పటికే అవసరమైన సూచనలు జారీ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

# కొత్తపల్లిగోరిలో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత:కేసు నమోదు చేసిన పోలీసులు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి





మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు,పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు.పోలీసులకు అందిన నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ భాస్కర్ల రాజు, కొత్తపల్లిగోరి పోలీసులు కలిసి గ్రామంలోని చాపతి రమ (భర్త వీరన్న) అనే మహిళ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన సుమారు 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది.ప్రభుత్వం పేదల కోసం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించిన సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ భాస్కర్ల రాజు వెంటనే ఆ బియ్యాన్ని సీజ్ చేశారు.అనంతరం అక్రమ నిల్వలకు బాధ్యురాలైన సదరు మహిళపై ఫిర్యాదు చేయగా,కొత్తపల్లిగోరి ఎస్ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినా లేదా అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.ఈ దాడుల్లో సివిల్ సప్లై సిబ్బంది,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం"



సత్తుపల్లి,ఆర్ సి,మే 08(తెలుగుగళం) న్యూస్ : సత్తుపల్లి మండల పరిధిలోని సదాశివునిపాలెం గ్రామంలో గల విద్యుత్ ఉపకేంద్రంలో నూతన ఏబీ స్విచ్ల ఏర్పాటు పనులు, ఉపకేంద్ర నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో నేడు అనగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ అసిస్టెంట్ ఇంజినీర్ ఉబ్బన శరత్ శుక్రవారం ఓ ప్రకటనలో మీడియా ద్వారా ప్రజలకు తెలిపారు.దీంతో సదాశివునిపాలెం,సిద్ధారం గ్రామాలతో పాటు తుంబూరు వ్యవసాయ ఫీడర్, నారాయణపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# వార్షికోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ"





సత్తుపల్లి,ఆర్ సి,కల్లూరు,మే 8(తెలుగుగళం)న్యూస్: వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కల్లూరు బస్టాండ్లో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కల్లూరు మున్సిపాలిటీ కప్పలబంధం రోడ్డుకు చెందిన పుచ్చల శ్రీనివాసరావు, ఉమాదేవి దంపతులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేసవి తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ నుండి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా టీం సత్తుపల్లి సభ్యులు కిన్నెర ఆనంద్, స్థానికులు దంపతులకు వివాహ వార్షికోత్సవ శు భాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

# నామినేటెడ్ కమిటీలు వద్దు- ఎన్నికలే ముద్దు

### సహకార సంఘాలపై బీకేఎంయూ నేత వెంకట్రాములు డిమాండ్

### సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చొద్దు:

### ప్రభుత్వానికి బీకేఎంయూ హెచ్చరిక



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 8**

వరంగల్ జిల్లా:పర్వతగిరి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ కమిటీలు వేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పిఏసిఎస్‌ల పాలకవర్గాలను రద్దు చేసిన ప్రభుత్వం నామినేటెడ్ కమిటీలు వేయడానికి రంగం సిద్ధం చేసినట్లు,అందుకోసం ఆర్డినెన్స్ తీసుకురావడానికి కసరత్తు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని

"సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయడం దుర్మార్గం.రైతుల ప్రయోజనాలను కాపాడడానికి,వారి సంక్షేమం కోసం పనిచేయడానికి ఏర్పడిన సహకార సంఘాలకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిపి సహకార వ్యవస్థను పటిష్టం చేయాలి. కానీ అధికార పార్టీ తమ అనుయాయులకు పదవులు కట్టబెట్టే ఆలోచన చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం"అని విమర్శించారు.ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు జరపకుండా రైతుల సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలు జరిగితే రైతుల ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని భావించే ఎన్నికలు జరపకుండా అనుయాయులకు పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే, రైతాంగాన్ని అవమానపరచడమే"అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణిని విడనాడి సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని,లేనిచో రైతుల, ప్రజాస్వామ్యవాదుల విశ్వాసాన్ని కోల్పోవలసి వస్తుందని వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు

# బస్తా మాదే,ఖర్చు మాదే... కొనే నాథుడే లేడు

### రైతుల గోడు విన్న ఎర్రబెల్లి దయాకర్ రావు

### ఎర్రటి ఎండలో రైతు కన్నీరు: మక్కలు, వరి కొనుగోలు వెంటనే చేపట్టాలి-మాజీ మంత్రి డిమాండ్



**తెలుగు గళం న్యూస్ నెక్కొండ/మే8**

వరంగల్ జిల్లా: నెక్కొండ మండలం ఫణికర గ్రామ శివారులోని సాయిరెడ్డిపల్లెలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గోదామును పరిశీలించారు.అటువైపు వెళుతున్న ఆయనను చూసిన రైతులు ఒక్కసారిగా వాహనాన్ని ఆపి తమ గోడు వెళ్లబోసుకున్నారు.కిలోమీటర్ల కొద్దీ వాహనాల క్యూ:సుమారు 200కు పైగా వాహనాలతో రైతులు రోజుల తరబడి రోడ్డుపైనే పండిన పంటతో నిరీక్షిస్తున్నారు.గోదాముల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.బస్తాకు 300 రూపాయల ఖర్చు అవుతున్నా కళ్లాల నుండి పంట కదలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "బస్తా మాదే, అమాలి ఖర్చు మాదే, లారీ కిరాయి మాదే... అయినా మా పంట కొనే నాథుడే లేడు"అని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ...ఎన్నడూ లేని విధంగా రైతులను ఇబ్బందులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదు.ప్రభుత్వ మెడలు వంచైనా రైతుల పక్షాన ఉద్యమిస్తాం.ప్రతి గింజ కొనే వరకు పోరాడుతాం. ఎర్రటి ఎండలో రైతులను చూస్తే రేవంత్ రెడ్డికి గోస అనిపించడం లేదా?బోకస్ మాటలు,చిల్లర మాటలు మానుకొని మొక్కజొన్న, వరి కొనుగోలుపై శ్రద్ధ పెట్టాలి" అని డిమాండ్ చేశారు.బస్తాల కొరతతో మొక్కజొన్న కొనుగోలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభుత్వం కనీసం రైతులకు విత్తనాలు,ఎరువులు ఇవ్వలేకపోతోంది.సకాలంలో రైతుబంధు ఇవ్వకపోగా కనీసం పండిన పంటను మద్దతు ధరకు కొనే పరిస్థితిలో కూడా లేదు.ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వం"అని విమర్శించారు.

రాష్ట్రంలో 11లక్షలఎకరాల్లో మక్కజొన్న పండితే,సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదు.ప్రారంభమైనవి కూడా లారీలు లేక,బస్తాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మద్దతు ధర రూ.2400ఉంటే రూ.1600–1800కే అమ్ముకుని రైతులుమోసపోతున్నారు.మొక్కజొన్న కొనుగోలుపై ప్రభుత్వం ఇంతవరకు నిర్ణయమే తీసుకోలేదు.ఆరుగాలం కష్టపడ్డ రైతులు మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్లి సగం ధరకే జొన్నలు అమ్ముకునే దుస్థితి వచ్చింది.వడ్లు కూడా రోడ్ల మీదనే ఉన్నాయి"అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి మక్కలు కొనుగోలు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు.



# జేవీఆర్ బొగ్గు నిర్వహణ కేంద్రంలో సంకేత, దూరవాణి వ్యవస్థ ప్రారంభం"







**సత్తుపల్లి,ఆర్ సి,మే 8(తెలుగుగళం) న్యూస్ :** సింగరేణి సంస్థ పరిధిలోని జేవీఆర్ బొగ్గు నిర్వహణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సంకేత, దూరవాణి వ్యవస్థను సత్తుపల్లి ఏరియా ప్రధానాధికారి చింతల శ్రీనివాస్, ప్రధానాధికారి (పౌర విభాగం) డి వెంకటేశ్వర్లు, ప్రధానాధికారి (విద్యుత్--యంత్ర విభాగం) ఎస్వీ రాంమూర్తి సంయుక్తంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణిలో తొలిసారిగా జేవీఆర్ బొగ్గు నిర్వహణ కేంద్రంలో ఈ సంకేత, దూరవాణి వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా రైలు బోగీలలో బొగ్గు లోడింగ్, రవాణా ప్రక్రియ మరింత వేగంగా సాగుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అదనపు ప్రధానాధికారి (పౌర విభాగం) సీహెచ్ రామకృష్ణ, ప్రధానాధికారి కార్యాలయ ప్రత్యేక అధికారి బొల్లం శ్రీనివాసు, ఉప ప్రధానాధికారి (విద్యుత్--యంత్ర విభాగం) కె సోమశేఖరరావు, కిష్టారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారి ఏఎల్ఎస్‌వీ సునీల్‌వర్మ, జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ విభాగ అధికారి బి రాజేశ్వరరావు, కిష్టారం ఓపెన్‌కాస్ట్ విభాగ అధికారి బి రామకృష్ణ, పౌర విభాగ అధికారి ఎ రవికుమార్, ఏఐటీయూసీ సహాయ శాఖ కార్యదర్శి పి సూర్యప్రకాశ్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు బి కోటేశ్వరరావు, కె శ్రీనివాస్, సంక్షేమ అధికారి, ఏరియా అధికారులు, పౌర విభాగ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ అక్షరాస్యత విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి: రిహానా"




**సత్తుపల్లి,ఆర్ సి,మే 8(తెలుగుగళం) న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా సూచించారు.పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎల్ఎస్, ఓబీలు,ఆర్పీలకు శుక్రవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నరసింహ మాట్లాడుతూ అక్షరాస్యత కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు విద్యా వెలుగు చేరవేయడం లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని సూచించారు.శిక్షణ కార్యక్రమంలో: అక్షరాస్యత అమలు విధానం, ప్రజల్లో అవగాహన కల్పించే మార్గాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.






## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఆర్వో వసంత కుమారి



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

భూపాలపల్లి జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్వో)గా బాధ్యతలు స్వీకరించిన వసంత కుమారి శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఐడీఓసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన వసంత కుమారిని కలెక్టర్ అభినందిస్తూ, జిల్లా అభివృద్ధిలో మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రెవెన్యూ విభాగం పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆమెకు సూచించారు.ముఖ్యంగా రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతమైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు.దీనిపై డిఆర్వో వసంత కుమారి స్పందిస్తూ.. జిల్లాలో తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ,ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సమ్మెను జయప్రదం చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

### జాజిరి శ్రీనివాస్ పిలుపు"




**సత్తుపల్లి,ఆర్ సి,మే 8(తెలుగుగళం) న్యూస్ :** ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని రామానగరం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం కోసం దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగానే యూపీఏ ప్రభుత్వ కాలంలో 2005లో చట్టం అమలులోకి వచ్చిందన్నారు. 2006 అక్టోబర్ నుంచి అమలైన ఈ చట్టం వల్ల కోట్లాది వ్యవసాయ కార్మికులు, చిన్న మధ్యతరగతి రైతులకు ఉపాధి లభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు తగ్గడంతో పాటు వ్యవసాయ కార్మికులు కనీస వేతనాలను పెంచుకునే అవకాశం ఏర్పడిందన్నారు. మహిళలు, పురుషులకు సమాన వేతనాలు అమలైన తొలి చట్టం ఇదేనన్నారు.

ప్రపంచ ఆర్థిక మాంద్యం, కరోనా సంక్షోభ సమయంలో దేశ ప్రజలను ఆదుకున్నది ఉపాధి హామీ చట్టమేనని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ కొత్త విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు. కేంద్రం నిధుల వాటాను తగ్గించడం, వ్యవసాయ సీజన్‌లో పనులను నిలిపివేయడం, తక్కువ కూలి నిర్ణయించడం వంటి చర్యలు కార్మికుల హక్కులను హరించడమేనన్నారు.




పని ప్రదేశాల్లో రెండుసార్లు ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, పని దినాలను పెంచాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలందరికీ సంవత్సరానికి రూ.12 వేల ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం రామానగరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 100 మంది కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు.

కార్యక్రమంలో: గ్రామ సర్పంచ్ ఒంటెద్దు వెంకటమ్మ, మండల నాయకులు పిల్లి నాగమణి, కువ్వారపు లక్ష్మణరావు, అయినంపుడి సుందరరావు, పెరుమాండ్ల వెంకటరత్నం, పిల్లి కుమారి, సాదు నిర్మల, దండు లక్ష్మి, కొండ కుమారి, వేల్పుల జ్యోతి, గోకారపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దేవతాప్రసాద్‌ను పరామర్శించిన మువ్వా"

**సత్తుపల్లి,ఆర్ సి,మే 8(తెలుగుగళం)న్యూస్:** పట్టణంలోని 22వ వార్డుకు చెందిన మాచినేని దేవతాప్రసాద్ (అప్పాజీ)ను టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన దేవతాప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.



# పాడి రైతులకు చేయూత..

## లచ్చన్నగూడెంలో ఉచిత పశువైద్య శిబిరం"







సత్తుపల్లి,ఆర్ సి,మే 8(తెలుగుగళం) న్యూస్ : సత్తుపల్లి నియోజకవర్గం లోని వేంసూరు మండలంలోని లచ్చన్నగూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సర్పంచ్ పోతురాజు చక్రధర్ రావు ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించింది.శిబిరంలో వేంసూరు మండల పశు వైద్యాధికారి రాజశేఖర్, గోపాల మిత్రలు పాల్గొని పాడి రైతులకు పశుసంరక్షణపై అవగాహన కల్పించారు. ఎండాకాలంలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాల దిగుబడి పెంచే ఖనిజ మిశ్రమాల వినియోగం, గర్భకోశ వ్యాధుల నివారణ, పోషకాహార మేత ప్రాధాన్యతపై వివరించారు.

ఈ సందర్భంగా లేగదూడల పోటీ నిర్వహించి, ఆరోగ్యంగా పెరిగిన దూడలను ఎంపిక చేసి దూడల యజమానులకు మండల పశువైద్యులు రాజశేఖర్,సర్పంచ్ పోతురాజు చక్రధర్ రావు ల చేతులమీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో: గ్రామ రైతులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు,మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు, మత్స్యకారులు పాడి పశువుల పెంపకదారుల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) స్పష్టం చేశారు.రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక, మత్స్య, నీటి పారుదల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరం,రైతు వారోత్సవం,రైతు వారం కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాడి రైతులు తమ పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని,ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా మేలు జాతి దూడల పెంపకం కోసం లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించుకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని రైతులకు వివరించారు.రైతు వారోత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ.. చెరువుల్లో చేపల ఉత్పత్తిని పెంచేందుకు శాస్త్రీయ పద్ధతులు పాటించాలని, చేపలకు సోకే వ్యాధుల పట్ల మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. చెరువుల్లో గుర్రపుడెక్క వంటి కలుపు మొక్కలను నివారించడం ద్వారా నీటి నాణ్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడుతూ.. రైతు వారం కార్యక్రమంలో భాగంగా సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికను, జమ్ము, కంపచెట్లను తక్షణమే తొలగించాలని ఆదేశించారు.ఎత్తిపోతల పథకాలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయడంతో పాటు, నీటిపారుదల గేట్ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.రైతులకు సాగునీరు అందడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య,కొడవటంచ ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, మత్స్యకారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# నర్సింగ్ వృత్తి సేవాభావానికి నిదర్శనం:ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు






తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

నర్సింగ్ విద్యార్థులు తమ వృత్తిలో మానవత్వం, సహనం, సేవా దృక్పథాన్ని అలవర్చుకుని ఆదర్శంగా నిలవాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) పిలుపునిచ్చారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించిన 'లాంప్ లైటింగ్ ఒ ఓత్ సెరిమనీ' (జ్యోతి ప్రజ్వలన, ప్రమాణ స్వీకార ఉత్సవం) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో వైద్య సేవలు అందించే నర్సుల పాత్ర ఎంతో కీలకమని, రోగులకు నిస్వార్థంగా సేవ చేయడం దేవుడికి సేవ చేయడంతో సమానమని కొనియాడారు.నర్సింగ్ వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, అది అంకితభావంతో కూడిన పవిత్రమైన సేవా మార్గమని ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.లాంప్ లైటింగ్ కార్యక్రమం అనేది విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమని, ఇది అజ్ఞానమనే చీకటిని తొలగించి సేవా మార్గంలో వెలుగులు నింపే పవిత్ర సందర్భమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ నర్సులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

అనంతరం నర్సింగ్ వృత్తికి కట్టుబడి ఉంటామని విద్యార్థుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లను అందజేసి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, ప్రజా ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓంకార్ శతజయంతి ముగింపు సభను జయప్రదం చేయాలి

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు వరికుప్పల వెంకన్న"



సూర్యాపేట,మే08(తెలుగు గళం) న్యూస్: అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి షేక్ నజీర్ పిలుపునిచ్చారు. ఈనెల 12న వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించనున్న సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం సూర్యాపేటలో భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025 మే 12 నుంచి 2026 మే 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఓంకార్ పోరాడిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ శతజయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం, రజాకార్లు, భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఆయుధం చేతపట్టి పోరాడిన నాయకుడు మద్దికాయల ఓంకార్ అని కొనియాడారు.నర్సంపేట నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తి "అసెంబ్లీ టైగర్"గా పేరుగాంచారని గుర్తు చేశారు. కుల, మత, ప్రాంతీయ, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణమే ఆయన ఆశయమని పేర్కొన్నారు. చివరి వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల పక్షాన నిలిచిన నాయకుడని తెలిపారు.కమ్యూనిస్టు, వామపక్ష, సామాజిక శక్తుల ఐక్యత ద్వారానే దోపిడీ వ్యవస్థను ఎదుర్కొనగలమని అన్నారు. అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం సాధించేందుకు పోరాడిన ఓంకార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, వామపక్ష శక్తులు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శబరి, వివేక్, వెంకటేశ్వర్లు, వెంకన్న, నర్సయ్య, పద్మ, విమల, జ్యోతి, పుష్ప, ప్రభాకర్ రెడ్డి, అనంతమ్మ, పట్నం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన మువ్వా"



సత్తుపల్లి,ఆర్ సి,మే 8 (తెలుగుగళం)న్యూస్:

వేంసూరు: మండలంలోని పల్లెవాడ గ్రామంలో రావూరి నాయుడు, రమాదేవి దంపతుల కుమారుని వివాహ వేడుకలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

# జాతీయ జెండా కు అవమానం ఇది ఎక్కడి రాజ్యం....?

స్టేషన్ ఘనపూర్ మే 08(తెలుగుగళం) న్యూస్



జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రం నమిలికొండ గ్రామం రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా గద్దె జాతీయ జెండాను ఎగరవేసి స్థానంలో జాతి జెండాను తొలగించి ఎర్రజెండాను ఎగరవేస్తున్నారు ఇది అధికారులకు కనిపించడం లేదా..... లేదా అధికారుల నిర్లక్ష్యమా..... ఒక ప్రశ్న అర్థం గా మారింది అధికారులు ఉన్నారు జిల్లా కలెక్టర్ జాతీయ జెండాకు అవమానం చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై రాజకీయ విషం..

- హైకోర్టు ఆదేశాలనే ధిక్కరిస్తారా?
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిప్పులు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ లో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వేదికగా రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని, అధికార పక్ష నేతల ఒత్తిళ్లకు లొంగి దేవాదాయ శాఖ అధికారులు బరితెగించి ప్రవర్తిస్తున్నారని ఆలయ ధర్మకర్త,మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ భక్తుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత రెండు ఏళ్లుగా ఆలయ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కుటిల రాజకీయాలు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు ప్రజాస్వామ్య విరుద్ధమని వారు మండిపడ్డారు.ఈ సందర్భంగా గండ్ర దంపతులు మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం, భక్తుల అపారమైన సహాయ సహకారాలతో ఎంతో నిష్ఠతో అత్యంత తక్కువ కాలంలోనే ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనను అంగరంగ వైభవంగా నిర్వహించామని గుర్తు చేశారు.విగ్రహ ప్రతిష్ఠ నాటి నుండి నేటి వరకు ప్రతిరోజూ స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలు, విశేష పూజా కార్యక్రమాలు, శనివారపు అన్నదానాలను తాము తమ సొంత నిధులతో పాటు భక్తుల చందాలతో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామని తెలిపారు.ఇక్కడ భక్తి వెల్లివిరుస్తుంటే చూసి ఓర్వలేక,రాజకీయంగా లబ్ధి పొందాలనే దురాశతో కొంతమంది ఆలయంపై కేసులు వేస్తూ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జిల్లాలో దూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలు ఎన్నో ఉన్నా వాటిని పట్టించుకోని వీరు, నిత్యం భక్తులతో కళకళలాడే ఈ ఆలయంపై ఎందుకు కక్ష గట్టారు?" అని నిలదీశారు.ముఖ్యంగా, హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటిని దిక్కరించి దేవాదాయ శాఖ అధికారులు వ్యవహరించడం శోచనీయమని వారు పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్తలుగా ఉన్న తమకు కనీస ముందస్తు నోటీసులు ఇవ్వకుండా,హడావిడిగా ఒక కమిటీని నియమించి, ఈరోజు ఆ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించాలని చూడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. గత ఎనిమిది నెలల క్రితం కమిటీ నియామకానికి నోటీసు ఇచ్చినప్పుడు, తాము నిబంధనల ప్రకారం ఐదుగురు అభ్యర్థుల దరఖాస్తులను సమర్పించామని, కానీ అధికారులు రాజకీయ నాయకుల బెదిరింపులకు భయపడి ఆ దరఖాస్తులను బుట్టదాఖలు చేశారని ఆరోపించారు.అధికార పార్టీ నేతలు ఇచ్చిన పేర్లనే కమిటీ సభ్యులుగా ప్రకటించి,అడ్డదారిలో ఆలయ పాలనను హస్తగతం చేసుకోవాలని చూడటం భక్తులకు చేస్తున్న ద్రోహమని వారు వ్యాఖ్యానించారు.దేవుడి పేరుతో రాజకీయాలు చేసే వారికి పుట్టగతులు ఉండవని,కుట్రలతో ఆలయ పవిత్రతను దెబ్బతీయాలని చూస్తే భక్తులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.దేవాదాయ శాఖ అధికారులు ఇకనైనా తమ ఏకపక్ష ధోరణిని వీడి, చట్టబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ఈ రాజకీయ కుట్రలపై తాము న్యాయపోరాటం చేస్తామని, స్వామివారి ఆలయ అభివృద్ధిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగిపోనివ్వబోమని గండ్ర దంపతులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు జై వేంకటేశ్వర అంటూ నినాదాలు చేస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు.ప్రాంతీయ భక్తులు, మహిళలు, గ్రామ పెద్దలు ఈ నిరసనలో పాల్గొని అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు.





# తుమ్మల రాజకీయ ప్రస్థానానికి 40 ఏళ్లు"







సత్తుపల్లి,ఆర్ సి,మే 8(తెలుగుగళం)న్యూస్ : తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తొలి సారిగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి ఆధ్వర్యంలో శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువ నాయకుడు తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ దయానంద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు రాజకీయ కుట్రలో భాగంగా పుకార్లు సృష్టిస్తున్నారని విమర్శించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల నిర్మాణాలకు మట్టి, ఇసుక అవసరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చామని, అవినీతికి తమ కుటుంబంలో స్థానం లేదన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

ప్రజల మధ్యే ఉంటూ సేవ కొనసాగిస్తామని, ప్రజలకు నిజం తెలుసని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి, కల్లూరు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, అభిమానులు పాల్గొన్నారు.



# స్టేషన్ ఘనపూర్ లో ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు.. దేవాలయంలో ప్రత్యేక పూజలు

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే08




రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మరియు ఆర్టీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 59వ జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కొలిపాక సతీష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవాలయం మరియు రేణుక ఎల్లమ్మ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజారి రామానుజ చార్యులు ప్రత్యేక హోమాలు, అర్చనలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి మాల ధరించిన భక్తులకు మూడు రోజుల పాటు అన్నప్రసాదం, సాయంకాలం టిఫిన్, భోజనాలు, పండ్లు, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే పూజా సామగ్రి, చందనం, పూలు, కండువాలు, పంచాలు అందజేశారు.కొలిపాక సతీష్ మాట్లాడుతూ, పొన్నం ప్రభాకర్ విద్యార్థి దశలో ఎన్ఎస్యుఐ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా, ఎంపీల ఫోరం అధ్యక్షుడిగా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్ ప్రయాణం కల్పించడం, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడం, పీఆర్సీ అమలు చేయడంలో ఆయన కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ గట్టు రమేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు అంబటి కిషన్ రాజు, పెసరు సారయ్య, కొండోజు వేణు, సందీప్ యాదవ్, గట్టు రంజిత్, దారం రాజు, మౌనశ్రీ, తాళ్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# టీ20 జట్టులో భారీ మార్పులు.. సూర్య స్థానంలో శ్రేయాస్‌కు పగ్గాలు..?





టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై వేటు పడే ఛాన్సుంది. పేలవ ఫామ్‌తో తంటాలు పడుతున్న సూర్యను సారథిగా తప్పించాలని సెలక్షన్ కమిటీ భావిస్తున్నట్లు సమాచారం. 'స్కై' ఫామ్ అందుకుంటాడని కొంతకాలంగా వేచిచూస్తున్నప్పటికీ అతని ఆటతీరులో పెద్దగా మార్పు రాకపోవడంపై ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో సారథిగా, బ్యాటర్‌గా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్‌ను తిరిగి టీ20 జట్టులోకి తీసుకుని కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తారని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. జూన్ ఆఖర్లో రెండు టీ20ల సిరీస్ కోసం భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. జులై 1 నుంచి ఇంగ్లాండ్, భారత్ మధ్య ఐదు టీ20 సిరీస్‌లు జరగనున్నాయి. ఐపీఎల్ ముగిసిన తర్వాత సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. అప్పుడే శ్రేయస్ కెప్టెన్సీపై ప్రకటన వచ్చే ఛాన్స్ ఉంది. అంతేకాకుండా వన్డేలు, టీ20లు రెండింటికీ ఒకే కెప్టెన్ ఉండాలని బోర్డు ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. అయ్యర్‌కు రెండు ఫార్మాట్ల బాధ్యతలను అప్పగించే అవకాశం ఉంది.

"కొత్త టీ20 జట్టును ప్రకటించినప్పుడు కొన్ని మార్పులు ఉండొచ్చు. టీ20లు, వన్డేలకు ఒకే ఆటగాడు కెప్టెన్‌గా ఉండే దిశగా మేము ఆలోచిస్తున్నాము. ప్రస్తుతం మా దృష్టి ఈ రెండు ఫార్మాట్లపైనా ఉంది. యువ ప్రతిభను వెలికితీయడంతో పాటు అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు కూడా అవకాశాలు కల్పించాలని బీసీసీఐ భావిస్తోంది. గత కొన్నేళ్లుగా శ్రేయస్ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. దురదృష్టవశాత్తూ అతను గాయాల బారినపడుతున్నాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో తన జట్టును అద్భుతంగా ముందుకు నడిపిస్తున్నాడు. అతను వైట్‌బాల్ కెప్టెన్సీకి ప్రధాన పోటీదారు" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

సూర్యకుమార్ నాయకత్వంలో 2026 టీ20 ప్రపంచ కప్‌ను టీమ్ఇండియా దక్కించుకున్న సంగతి తెలిసిందే. కెప్టెన్సీ రికార్డు బాగానే ఉన్నప్పటికీ ఆటగాడిగా విఫలమవుతుండటం అతనికి మైనస్‌గా మారింది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో సూర్యకుమార్ ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి 195 పరుగులే చేశాడు. మరోవైపు, పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా ఉన్న శ్రేయస్.. 9 ఇన్నింగ్స్‌ల్లో 333 పరుగులు చేశాడు. అతని సారథ్యంలో పంజాబ్ మొదటి ఏడు మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు సాధించింది.

# ఈ చిన్న తప్పులే

## పేగుల ఆరోగ్యాన్ని క్షీణించేలా చేస్తాయి..



హెల్త్ న్యూస్ ,08 మే (తెలుగు గళం న్యూస్ ):

ఇప్పటి జీవనశైలిలో గట్ హెల్త్ లేదా జీర్ణాశయ ఆరోగ్యం గురించి అవగాహన వేగంగా పెరుగుతోంది. ఎందుకంటే పేగుల ఆరోగ్యం కేవలం జీర్ణక్రియకే పరిమితం కాదు. శరీర రోగనిరోధక శక్తి, మానసిక స్థితి, శక్తి స్థాయిలు, చర్మ ఆరోగ్యం వంటి అనేక అంశాలపై ఇది ప్రభావం చూపుతుంది. అయితే సోషల్ మీడియాలో కనిపించే ప్రతి గట్ ఫ్రెండ్లీ సలహా నిజంగా ఉపయోగకరమై ఉండకపోవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం, చాలా మంది ప్రతిరోజూ పాటించే కొన్ని సాధారణ అలవాట్లు పేగుల ఆరోగ్యాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తాయని చెబుతున్నారు. చాలా మందికి ఇవి తెలియకుండానే అలవాట్లుగా మారిపోయాయని పేర్కొంటున్నారు. పేగుల ఆరోగ్యాన్ని దెబ్బతీసే రోజువారీ అలవాట్ల గురించి వారు వివరిస్తున్నారు.

మరీ అధికంగా ఫైబర్ వద్దు..

చాలామంది ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఒక్కసారిగా అధిక ఫైబర్ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ప్రారంభిస్తారు. కానీ ఇలా అకస్మాత్తుగా ఫైబర్ పరిమాణం పెంచితే పొట్ట ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. క్రమంగా ఫైబర్ పరిమాణాన్ని పెంచడం ఉత్తమమని చెబుతున్నారు. అలాగే బరువు పెరుగుతామనే భయంతో కొందరు అన్ని రకాల ఫ్యాట్స్‌ను ఆహారంలో నుంచి పూర్తిగా తొలగిస్తారు. అయితే ఆరోగ్యకరమైన కొవ్వులు పేగుల పొరను బలంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గింజలు, అవకాడో, నెయ్యి వంటి మంచి కొవ్వులను పరిమితంగా తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

ఒకే రకం ఆహారం రోజూ వద్దు..

అదే విధంగా రోజూ ఒకేరకం ఆహారాన్ని పదే పదే తినడం కూడా గట్ హెల్త్‌కు మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియా వైవిధ్యమైన ఆహారంతోనే సమతుల్యంగా పెరుగుతాయి. అందుకే కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పప్పులు వంటి విభిన్న ఆహారాలను తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. అంతేకాకుండా భోజనాన్ని కార్బోహైడ్రేట్స్‌తో ప్రారంభించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముందు ఫైబర్ లేదా ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుని, తర్వాత కార్బొహైడ్రేట్స్ తీసుకోవడం జీర్ణక్రియకు మంచిదని సూచిస్తున్నారు.

ప్రోటీన్ బార్స్, షేక్స్‌ను పక్కన పెట్టండి..

ఇక సౌకర్యవంతంగా ఉంటాయని భావించి చాలామంది ప్రోటీన్ బార్లు, షేక్స్‌ను తరచూ తీసుకుంటున్నారు. కానీ వీటిలో చాలా వరకు అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇవి గట్ హెల్త్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చని హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా, ప్రతిరోజూ భోజనం చేసే సమయాలు మారుతూ ఉంటే జీర్ణవ్యవస్థ గందరగోళానికి గురవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పేగులు ఒక నిర్దిష్ట సమయానికి అలవాటు పడతాయి కాబట్టి, సమయపాలన చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. అదే విధంగా తిన్న వెంటనే పడుకోవడం కూడా జీర్ణక్రియను మందగింపజేస్తుంది. భోజనం తర్వాత కొంతసేపు నిటారుగా కూర్చోవడం లేదా నడవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది ఆహారం సులభంగా జీర్ణమవడంలో సహాయపడుతుంది.

ఈ విధంగా ఈ సూచనలు గట్ హెల్త్ కోసం కఠినమైన డైట్స్ అవసరం లేదని స్పష్టం చేస్తున్నాయి. ప్రతిరోజూ చిన్నచిన్న ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

# హనీ ట్రాప్ జరగొచ్చు..

## ఐపీఎల్ ప్లేయర్లకు బీసీసీఐ హెచ్చరిక



ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో తీవ్రస్థాయిలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతుండటంపై బీసీసీఐ సీరియస్ అయింది. ఆటగాళ్లు, అధికారులు హనీట్రాప్ ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు అన్ని జట్లకు బోర్డు కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా అధికారిక నోటీసులు పంపారు. "ఈ ఐపీఎల్ సీజన్‌లో కొందరు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు అధికారులు కొన్ని దుష్ప్రవర్తనలు, నిబంధనలను ఉల్లంఘించినట్లు బీసీసీఐ దృష్టికి వచ్చింది. వీటిని పరిష్కరించకుండా వదిలేస్తే అవి ఈ టోర్నమెంట్‌కు, సంబంధిత ఫ్రాంచైజీకి, పాలక మండలి అయిన బీసీసీఐకి చెడ్డపేరు తీసుకొస్తాయి" అని ఫ్రాంఛైజీలకు పంపిన ప్రకటనలో సైకియా పేర్కొన్నారు.

ఆటగాళ్లు, జట్లు భవిష్యత్తులోనూ, అలాగే తక్షణమే పాటించాల్సిన కఠిన నిబంధనలను కూడా బీసీసీఐ రూపొందించింది. వాటిని తక్షణమే అమలులోకి తెచ్చింది. టీమ్ మేనేజర్ అనుమతి లేకుండా ఆటగాళ్లు, సహాయక సిబ్బందిని కలవడానికి వారి హోటల్ గదిలోకి ఇతరులను అనుమతించకూడదని స్పష్టం చేసింది. ఆటగాళ్లను కలిసే అతిథుల వివరాలను రికార్డు చేయాలని సూచించింది. అవసరమైతే ఆకస్మిక తనిఖీలు చేపడతామని పేర్కొంది. నిబంధనలను ఉల్లంఘించిన వారికి షోకాజ్ నోటీసులు, భారీ జరిమానాలు, సస్పెన్షన్ లేదా డిస్క్వాలిఫికేషన్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిషేధిత పదార్థాల వినియోగం, భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా పోలీసు కేసులు కూడా నమోదయ్యే అవకాశముందని బీసీసీఐ పేర్కొంది.

# నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల డంప్ స్వాధీనం

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలోని టోకే అడవుల్లో మావోయిస్టుల డంప్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీఎస్ఎఫ్, పోలీసు బలగాలు సంయుక్త ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో 315 బోర్ రైఫిళ్లు, 12 బోర్ రైఫిళ్లు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, లైవ్ కాట్రిడ్జ్‌లు, భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, ట్రిగ్గర్ మెకానిజమ్‌లు, వైర్లు, కమ్యూనికేషన్ పరికరాలు, ఇతర సామగ్రి ఉన్నాయి. మావోయిస్టులు భారీ దాడికి పాల్పడేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దీనికోసం అడవిలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను దాచిపెట్టారని భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. డంప్‌ను సకాలంలో కనుగొనడంతో మావోయిస్టుల కుట్రను బలగాలు భగ్నం చేశాయి.

# ఓటీటీలోకి 'ధురంధర్ 2'.. కాకపోతే చిన్న ట్విస్ట్..



ప్రేక్షకులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' ఓటీటీ డేట్ లాక్ చేసుకుంది. నేటికి ఈ సినిమా విడుదలై 50 రోజులైన సందర్భంగా నెట్‌ఫ్లిక్స్ యాప్‌లో దీని ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని వెల్లడించింది. మే 14 నుంచి ఓవర్సీస్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది . అన్‌కట్ వెర్షన్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. 3.52 గంటల నిడివితో 'ధురంధర్: ది రివెంజ్'ను డిజిటల్ ప్రేక్షకులకు అందిస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ పేర్కొంది. ఇక ఇండియాలో జియోహాట్ స్టార్ వేదికగా ఇది అందుబాటులోకి రానుంది. మే 15 నుంచి ఇక్కడి ప్రేక్షకులకు ఇది అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. జియో హాట్‌స్టార్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

**కథేంటంటే..**

ఆపరేషన్ 'ధురంధర్'లో భాగంగా జస్కిరాత్ సింగ్ తన పేరును హమ్జా అలీ మజారీ (రణ్‌వీర్ సింగ్)గా మార్చుకుని పాకిస్థాన్ వెళ్తాడు. అక్కడి ల్యారీ పట్టణంలోని బలోచ్ తెగ నాయకుడు రెహమాన్ డెకాయిత్ (అక్షయ్ ఖన్నా)ను చంపేస్తాడు. ఇదే అదనుగా భావించిన మరో గ్యాంగ్ నాయకుడు అర్షద్ పప్పు (అశ్విన్ ధర్) ల్యారీకి తనని తాను కింగ్‌గా ప్రకటించుకుంటాడు . అన్న చావుకు అర్షద్ పప్పు కారణమని తెలిసిన ఉజెయిర్ బలోచ్ (డానిష్) అతడిపై ఎలా పగతీర్చుకున్నాడు? ఉజెయిర్ బలోచ్ ల్యారీ పీఠం ఎక్కకుండా హమ్జా వేసిన ఎత్తులు ఏంటి? ఈ క్రమంలో ఎస్పీ అస్లాం చౌదరి (సంజయ్ దత్) నుంచి హమ్జాకు ఎలాంటి ప్రతిఘటన ఎదురైంది? బడే సాబ్ అలియాస్ దావూద్ ఇబ్రహీం (డానిష్ ఇక్బాల్) ఆదేశాల మేరకు ఉగ్రదాడులకు ప్రణాళిక రచించిన మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్)ను హమ్జా ఎలా అడ్డుకున్నాడు? హమ్జా ఇండియన్ గూఢచారి అని తెలిసిన తర్వాత ఇక్బాల్ ఏం చేశాడు?అనేది కథ.

---

# బాలీవుడ్ చీకటి కోణాలను బయటపెట్టిన సిమ్రాన్



దశాబ్దాల పాటు తన అందం, అభినయం, అద్భుతమైన డాన్స్‌తో దక్షిణాది సినీ సామ్రాజ్యాన్ని ఏలిన సీనియర్ నటి సిమ్రాన్. 1995లో 'సనమ్ హర్జాయ్' మూవీతో వెండితెరకు పరిచయమైన సిమ్రన్.. 'కన్నత్తిల్ ముత్తమిట్టల్','వాలి', 'ప్రియమానవలే','పంచతంత్రం' వంటి చిత్రాలు ఆమెను స్టార్‌ను చేశాయి. తాజాగా సెకెండ్ ఇన్నింగ్ ప్రారంభించిన ఆమె శశికుమార్ సరసన 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంలో నటించి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అయితే ముందు నుండి కూడా సీనియర్ హీరోయిన్ లు చాలా మంది బాలీవుడ్ మీద అసహనం వ్యాక్తం చేస్తువస్తున్నప్పటికి తాజాగా సిమ్రాన్ కూడా వైరల్ కామెంట్స్ చేశారు..

సిమ్రాన్ మాట్లాడుతూ.. 'నేను నా జీవితంలో సగానికి పైగా సమయాన్ని సినిమాకే ఇచ్చాను. కానీ బాలీవుడ్‌లో మమ్మల్ని కొత్త నటుల్లా చూస్తారు. మాకున్న లెగసీని వారు అస్సలు గుర్తించరు. అందుకే నాకు అవకాశాలు వచ్చినా హిందీ సినిమాలు చేయను. కేవలం గౌరవం విషయంలోనే కాకుండా, కనీస వసతుల విషయంలో కూడా బాలీవుడ్ నిర్మాణ సంస్థలు చాలా మూర్కంగా వ్యవహరిస్తాయి. హోటల్ గదులు, విమాన టిక్కెట్లు, వ్యక్తిగత స్టాఫ్ విషయంలో కూడా బేరాలు ఆడతారు. అటువంటి ఆధిపత్యం ఉన్న చోట పని చేయడం నా వల్ల కాదు' అని ఆమె కుండబద్ధలు కొట్టారు. అయితే సన్నీ డియోల్ వంటి వారు మాత్రం ఎంతో వినయంగా ఉంటారని, ఆయనతో పనిచేయడం సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సిమ్రాన్ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఓవర్సీస్‌లో 'పెద్ది' ఆట షురూ.. రికార్డులు మొదలు



రామ్ చరణ్ 'పెద్ది'పై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ స్పోర్ట్స్ డ్రామా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా ఒకరోజు ముందుగానే విదేశాల్లో సందడి చేయనుంది. తాజాగా అక్కడ ప్రీసేల్ బుకింగ్స్ ఓపెన్ చేయగా టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. 24 గంటలు కూడా కాకముందే లక్ష టికెట్స్ సేల్ అయ్యాయి. దీంతో నార్త్ అమెరికాలో అత్యంత వేగంగా ఇన్ని టికెట్స్ అమ్ముడైన తొలి సినిమాగా 'పెద్ది' రికార్డు నెలకొల్పింది. ట్రైలర్ కూడా విడుదల కాకముందే ఈ స్థాయిలో టికెట్స్ సేల్ కావడంతో అభిమానులు సంబరపడుతున్నారు. సినిమా విడుదలకు ఇంకా చాలా రోజులు ఉండడంతో అప్పటివరకూ మరిన్ని రికార్డులు సొంతం చేసుకోవడం ఖాయమని భావిస్తున్నారు. మరోవైపు 'పెద్ది' పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. తాజాగా ఎడిటింగ్ కూడా పూర్తయిందని దర్శకుడు తెలిపారు. త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ట్రైలర్ విడుదలైన అనంతరం టికెట్స్ భారీగా సేల్ అవ్వొచ్చని సినీవర్గాల సమాచారం. ఎమోషన్ ప్రధానంగా తెరకెక్కిన ఈ కమర్షియల్ సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందని దర్శకుడు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పెద్దిని మన హృదయాల్లోంచి తీసేయడం అంత తేలిక కాదని బుచ్చిబాబు తాజాగా చెప్పారు.

# శ్రద్ధా కపూర్ తండ్రి మరణ వార్తలపై కలకలం.. స్వయంగా స్పందించిన నటుడు!



బాలీవుడ్ సీనియర్ నటుడు శక్తి కపూర్ మరణించారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వార్తలు అభిమానుల్లో కలకలం రేపాయి. ముఖ్యంగా హీరోయిన్ శ్రద్ధ కపూర్ తండ్రి మృతి చెందారనే ప్రచారం పెద్ద ఎత్తున సాగడంతో సినీ వర్గాలు ఆందోళన చెందాయి.

అయితే ఈ పుకార్లపై స్వయంగా స్పందించిన శక్తి కపూర్... "నా మరణ వార్తలు పూర్తిగా అబద్ధం. నేను ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నాను" అంటూ క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా తప్పుడు ప్రచారం చేసిన వారిపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

శక్తి కపూర్ స్పందనతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో "టైగర్ ఇంకా స్ట్రాంగ్‌గానే ఉన్నాడు" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

# తమన్ షేర్ చేసిన తారక్ లుక్ వైరల్



టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొత్త లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రముఖ సంగీత దర్శకుడు థమన్ షేర్ చేసిన బ్లాక్ అండ్ వైట్ ఫోటో ఇప్పుడు అభిమానుల్లో భారీ చర్చకు దారితీస్తోంది.

ఈ ఫోటోలో తారక్ స్లిమ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తూ కొత్త మాస్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. తడి జుట్టు, స్టైలిష్ గడ్డం, నోట్లో టూత్‌పిక్‌తో కనిపించిన తారక్ లుక్ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తోంది.

ప్రస్తుతం ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్' సినిమాలో ఇదే తారక్ లుక్ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రాలేదు.

ఇక తారక్--థమన్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేక క్రేజ్ ఉంది. గతంలో బాద్ షా, టెంపర్, అరవింద సమేత వంటి హిట్ చిత్రాలకు థమన్ సంగీతం అందించారు.

# కార్తితో మీనాక్షి?



కథానాయకుడు కార్తి తెలుగులో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' విజయాలతో అందర్నీ మెప్పించిన కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. ఇది గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైనట్లు తెలిసింది. కల్యాణ్ శైలికి తగ్గట్లుగా ఓ సరికొత్త వినోదాత్మక కథతోనే ఈ చిత్రం ముస్తాబు కానుందని సమాచారం. దీంట్లో మీనాక్షి చౌదరి కథానాయికగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలు కానుంది. దీన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇక ప్రస్తుతం కార్తి నటించిన 'సర్దార్ 2' నిర్మాణానంతర పనుల్లో ఉండగా.. 'మార్షల్' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది.

# ఆ '100వ సినిమా' తీయకుండానే వెళ్ళిపోయారు..

## ఆర్‌బీ చౌదరి పై రజనీకాంత్ ఎమోషనల్..



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఎంతోమంది దర్శకులను, నటులను పరిచయం చేసిన ఆర్‌బీ చౌదరి మరణం.. ఇండస్ట్రీకి తీరని లోటు. అయితే తాజాగా సూపర్ స్టార్ రజనీకాంత్ వారి ఇద్దరి మధ్య జరిగిన చివరి సంభాషణను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.. 'నేను జైలర్ 2 షూటింగ్‌లో ఉండగా ఆయన నాకు ఫోన్ చేశారు. తన బ్యానర్‌లో ఇప్పటివరకు 99 సినిమాలు పూర్తి చేశానని, తన 100వ సినిమా నా (రజనీ) తో తీసి గౌరవప్రదంగా రిటైర్ అవ్వాలని అనుకుంటున్నట్లు తన కోరికను వెల్లడించారు' అని రజనీకాంత్ తెలిపారు. అంతేకాకుండా, ఆ 100వ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే రెండు మూడు కథలు కూడా సిద్ధంగా ఉన్నాయని ఆర్‌బీ చౌదరి రజనీకాంత్‌తో చెప్పారట. అందుకు రజనీకాంత్ కూడా సానుకూలంగా స్పందిస్తూ, ఖచ్చితంగా ఆ సినిమాలో నటిస్తానని మాట ఇచ్చారట. కానీ, ఆ మైలురాయి లాంటి సినిమా పట్టాలెక్కకముందే ఆయన ఇలా అకాల మరణం చెందడం దురదృష్టకరమని తలైవర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌బీ చౌదరి ఎప్పుడూ తన పరిమితులు తెలుసుకుని సినిమాలు తీసేవారని, ఎవరితోనూ వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఉండేవారని రజనీకాంత్ గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం విశాల్ హీరోగా రూపొందుతున్న 'మకుటం' సినిమా ఆర్‌బీ చౌదరి గారి 99వ చిత్రంగా నిలిచిపోయింది. ఆయన కలగా మిగిలిపోయిన 100వ సినిమా గురించి రజనీకాంత్ చెప్పిన మాటలు ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో విషాదాన్ని నింపాయి.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.